క్లుప్తంగా

టమాటాల కోసం జనం బారులు



స్టీల్‌ప్లాంట్ రైతుబజార్‌లో టమాటాల కోసం బారులు తీరిన ప్రజలు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ రైతు బజార్‌లో టమాటాల కోసం ప్రజలు ఉదయం నుంచి బారులు తీరారు. ధరలు ఆకాశాన్ని అంటడంతో రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీతో రైతు బజార్లలో అమ్మకాలు ప్రారంభించింది. రైతు బజార్‌లో ఆధార్ కార్డు ఆధారంగా టమాటాలు అందిస్తున్నారు. ఆదివారం కూడా సరఫరా ఉండటం, సెలవు దినం కావడంతో ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో టమాటాల కోసం బారులు తీరారు. ఈ అంశంపై రైతు బజార్ ఎస్టేట్ ఆఫీసర్ మురళీకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజలకు టమాటాలు అందిస్తున్నామన్నారు.

హడలెత్తిస్తున్న కుక్కలు



అక్కిరెడ్డిపాలెంలో సంచరిస్తున్న కుక్కలు

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డు అక్కిరెడ్డిపాలెంలో కుక్కలు హడలెత్తిస్తున్నాయి. వీధుల్లో మందలుగా సంచరిస్తూ భయాందోళనలకు గురి చేస్తున్నాయి. రాత్రి వేళల్లో ఒకదానిపై ఒకటి దాడులు చేసుకుంటూ అరుస్తూ స్థానికులకు నిద్ర లేకుండా చేస్తున్నాయి. ద్విచక్ర వాహనదారులపై దాడులు చేస్తూ ప్రమాదాలకు కారణమవుతున్నాయి. పొరబాటున ఇళ్ల తలుపులు, గేట్లు తీసి ఉంటే ఏకంగా నివాసాల్లోకి చొరబడుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి కుక్కల నియంత్రణకు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

కృష్ణదేవరాయ కల్యాణ మండపానికి రూ.లక్ష విరాళం



విరాళం అందజేస్తున్న కరణంరెడ్డి నర్సింగరావు

గాజువాక: పాతకర్లవానిపాలెంలో నిర్మిస్తున్న శ్రీకృష్ణదేవరాయ ఏసీ కల్యాణ మండపానికి బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు రూ.1 లక్ష విరాళమిచ్చారు. ఈ మేరకు తన కార్యాలయంలో ఆ మొత్తాన్ని కాపు సంఘం అడ్‌హక్ కమిటీ చైర్మన్ గుడివాడ అమ్మన్నకు అందజేశారు. ఈ సందర్భంగా అమ్మన్న మాట్లాడుతూ కాపు సంఘానికి నర్సింగరావు విశేష సేవలు అందిస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాపు సంఘం నాయకులు తాటికొండ జగదీష్, గంధం వెంకటరావు, ఇందల ఈశ్వరరావు, సలాది వెంకట రమణ, జీలకర్ర కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

కన్యకా పరమేశ్వరికి వెండి కుందుల బహూకరణ



వెండి కుందులు బహూకరిస్తున్న మధు దంపతులు

పెదగంట్యాడ: జీవీఎంసీ 76వ వార్డు పరిధిలోని హౌసింగ్ బోర్డు కాలనీ సమీపంలో గల వాసవీ కన్యకా పరమేశ్వరి పంచాయతన ఆలయంలో అమ్మవారికి నగరంలోని ఇసుకతోటకు చెందిన శ్రీధరాల మధు, శిల్ప దంపతులు రెండు కిలోల వెండి కుందులను ఆదివారం బహూకరించారు. ఈ మేరకు ఆలయ కమిటీ సభ్యులకు వాటిని అందజేసి, అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మొగలపల్లి త్రిమూర్తులు, ముమ్మిడిశెట్టి ముత్యాలశెట్టి, కొల్లా అప్పలరాజు, కుమార్, బొండాడ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

అక్కరకురాని బస్ షెల్టర్

- రోడ్ల మీద, చెట్ల కింద వేచి చూస్తున్న ప్రయాణికులు
- అందరికీ ఉపయోగపడేలా నిర్మించాలని ప్రయాణికుల వినతి



దువ్వాడ రైల్వేస్టేషన్‌లో బస్టాప్‌నకు దూరంగా ఉన్న షెల్టర్



బస్ షెల్టర్ ఖాళీగా ఉండడంతో సేదదీరుతున్న దుకాణదారులు

అగనంపూడి: దువ్వాడ రైల్వేస్టేషన్ నాలుగో నంబర్ ప్లాట్‌ఫామ్ వైపు ఉన్న బస్ షెల్టర్ ప్రయాణికులకు అందుబాటులో లేక నిరుపయోగంగా మారింది. నాలుగేళ్ల క్రితం దాతల సహకారంతో వీఎస్ఈజెడ్ గోడను ఆనుకుని రైల్వే అధికారులు స్థలం కేటాయించడంతో 2018లో బస్ షెల్టర్ నిర్మించారు. అయితే ఈ షెల్టర్ రోడ్డుకు, బస్సులు నిలిపేందుకు కేటాయించిన స్థలానికి దూరంగా ఉండడంతో ప్రయాణికులకు ఇది నిరుపయోగంగా మారింది. నాలుగో నంబర్ ప్లాట్‌ఫామ్ వైపు విజయవాడ నుంచి వచ్చే రైళ్లకు హాల్ట్ ఉండడంతో వేలాది మంది ప్రయాణికులు ఈవైపుగా దిగి వారి గమ్యస్థానాలకు చేరుకుంటున్నారు. అలాగే పలు రైళ్లను విశాఖ వరకు వెళ్లకుండా దువ్వాడ మీదుగా మళ్లిస్తున్నారు. దీంతో నిత్యం ఈ స్టేషన్ రద్దీగా ఉంటుంది. సుమారు 12 లక్షల మంది సాలీనా ప్రయాణికులు స్టేషన్ నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. 44 జతల రైళ్లకు దువ్వాడలో హాల్ట్ ఉంది. ఇవి కాకుండా స్పెషల్ రైళ్లు, వారాంతపు రైళ్లకు కూడా ఇక్కడ హాల్ట్ ఉండడంతో బీహెచ్‌పీవీ, మల్కాపురం, శ్రీహరిపురం, గాజువాక, ఆటోనగర్, షీలానగర్, పెదగంట్యాడ లంకెలపాలెం, పరవాడ, ఎన్టీపీసీ, స్టీల్‌ప్లాంట్, సబ్బవరం శివారు గ్రామాలకు చెందిన ప్రయాణికులు దువ్వాడలో రైలు దిగి వివిధ మార్గాల ద్వారా గమ్యస్థానాలకు చేరుకుంటున్నారు. స్టేషన్ ఆవరణలో ప్రీపెయిడ్ ఆటోస్టాండ్ లేకపోవడంతో ఆటోల దోపిడీ తట్టుకోలేక వేలాది మంది ఆర్టీసీ బస్సులనే ఆశ్రయిస్తున్నారు. దువ్వాడ రైల్వేస్టేషన్ నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్, సింహాచలం, పెందుర్తి, చోడవరం, గాజువాక ప్రాంతాలకు సుమారు 100 సిటీ సర్వీస్‌లను నడుపుతున్నారు. అయితే ప్రయాణికులకు అనువుగా బస్‌షెల్టర్ లేకపోవడంతో చెట్లు, పిట్టగోడలు, రోడ్ల మీదే ఎండకు ఎండి, వానకు తడుస్తూ ప్రయాణికులు వేచి ఉంటున్నారు.

ఉపయోగపడేలా షెల్టర్లు నిర్మించాలి

ప్రయాణికులకు ఉపయోగపడేలా బస్ షెల్టర్ నిర్మిస్తే బాగుంటుంది. బస్సులు నిలిపే చోట కాకుండా రోడ్డుకు, స్టేషన్ ముఖద్వారానికి దూరంగా షెల్టర్ నిర్మించడం వల్ల నిరుపయోగమే తప్ప ప్రయాణికులకు ఎలాంటి ఉపయోగం ఉండదు. రైల్వే, ఆర్టీసీ అధికారులు ప్రయాణికుల అవసరాన్ని దృష్టిలో పెట్టుకుంటే మంచిది. సునీత, విద్యార్థిని.

ఏడాది నుంచి స్థలం కేటాయించాలని కోరుతున్నాం..

ప్రయాణికులకు వీలుగా బస్ షెల్టర్ నిర్మించాలని ఏడాది నుంచి కోరుతున్నాం. ఆర్టీసీ అధికారులు, దువ్వాడ రైల్వే యూజర్స్ అసోసియేషన్ తరఫున పలుమార్లు రైల్వే అధికారులను కోరాం. ప్రస్తుతం బస్సులు నిలుపుతున్న స్థలానికి పక్కనే షెల్టర్ నిర్మించాలని రైల్వే అధికారులకు వినతిపత్రాల్లో, ట్విట్టర్, వాట్సాప్ ద్వారా కోరాం. ప్రయోజనం లేకపోవడంతో బాధలు తప్పడం లేదు. –కె.ఈశ్వర్, కార్యదర్శి, దువ్వాడ రైల్వే యూజర్స్ అసోసియేషన్.

గంగవరం పోర్టు కార్మికులకు ఆర్థిక సాయం



గంగవరం పోర్టు కార్మికులకు నగదు అందజేస్తున్న కార్పొరేటర్ దల్లి గోవింద్

పెదగంట్యాడ: అదానీ గంగవరం పోర్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ 20 రోజులుగా నిరవధిక నిరాహార దీక్షలు చేస్తున్నా యాజమాన్యం స్పందించకపోవడం సరికాదని 64వ వార్డు కార్పొరేటర్ దల్లి గోవింద్ అన్నారు. గత నెల రోజులుగా విధులకు వెళ్లకపోవడంతో కార్మికులు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గంగవరం పోర్టు ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన దీక్షా శిబిరాన్ని ఆదివారం ఆయన సందర్శించారు. కార్మికులకు మద్దతు ప్రకటించారు. అలాగే రూ.20వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ మూగి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పోర్టు కార్మికులకు అండగా ఉంటాం



దీక్షా శిబిరంలో కూర్చుని మద్దతు తెలుపుతున్న రుద్రరాజు

పెదగంట్యాడ: అదానీ గంగవరం పోర్టు కార్మికులకు అండగా ఉంటామని పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు అన్నారు. గంగవరం పోర్టు ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో స్టీల్‌ప్లాంట్ ఆస్పత్రి వద్ద చేపట్టిన నిరసన దీక్షలు ఆదివారం 20వ రోజుకు చేరుకున్నాయి. ఈ నేపథ్యంలో శిబిరాన్ని ఆయన సందర్శించారు. కార్మికుల ఆందోళనకు సంఘీభావం తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సున్నితమైన సమస్యలను పరిష్కరించడంలో పోర్టు యాజమాన్యం వైఖరి సరికాదన్నారు. కార్మికులకు రూ.36వేలు వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. విధుల నుంచి తొలగించిన కార్మికులను మళ్లీ విధుల్లోకి తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నొల్లి తాతారావు, జె్రిపోతుల ముత్యాలు, సీపీఎం జిల్లా కార్యదర్శి జగ్గునాయుడు, కొవిరి అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

అధికారుల తీరుపై బాధితుల నిరసన

సమాచార హక్కు చట్టాన్ని నీరుగార్చుతున్నారని ఆరోపణ

అగనంపూడి: విధి నిర్వహణలో ఉక్కు కర్మాగారం ఆవరణలో అధికారి మరణిస్తే కనీసం విచారణ జరపకుండా ఆన్‌డ్యూటీలో మరణించలేదని ఉక్కు యాజమాన్యం బుకాయించడం, వారి తప్పులను కప్పిపుచ్చే విధంగా ఫ్యాక్టరీస్ చీఫ్ ఇన్‌స్పెక్టర్ సమాధానం ఉందని సమాచార హక్కు చట్టం ఉద్యమకర్త పట్టా రామ అప్పారావు, మృతుని భార్య బంగారమ్మ ఆరోపించారు. అగనంపూడిలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఐదేళ్ల క్రితం విశాఖ ఉక్కులో విధులు నిర్వహించే అధికారి నాత్ర తాతారావు విధి నిర్వాహణలో మరణించారని, నాలుగు రోజుల తర్వాత మృతదేహం కనపడిందని, అయితే తాతారావు ఆన్‌డ్యూటీలో మృతి చెందలేదని యాజమాన్యం బుకాయించడంతో రాష్ట్రపతికి ఫిర్యాదు చేశామన్నారు. విచారణ జరిపి యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని రాష్ట్రపతి కార్యాలయం రాష్ట్ర చీఫ్ సెక్రటరీకి లేఖ రాస్తే వాటికి నేటికీ సమాధానం లేకపోవడం ఆందోళన కలిగిస్తుందన్నారు. రాష్ట్రపతి ఆదేశాలను కూడా లెక్కచేయని పరిస్థితి ఉండడం బాధాకరమన్నారు. అలాగే విచారణ జరిపిన కర్మాగారాల ఉప ముఖ్య తనిఖీ అధికారి ఫ్యాక్టరీస్ చట్టం ప్రకారం ఎటువంటి చర్యలు తీసుకోలేమని లేఖ ద్వారా సరిపెట్టడం యాజమాన్యానికి వత్తాసు పలుకుతున్నట్టు ఉందన్నారు.

స్టీల్‌సిటీ డిపోలో కొనసాగుతున్న దీక్షలు



స్టీల్ సిటీ డిపో దీక్షలో పాల్గొన్న కార్మికులు

ఉక్కునగరం: ఆర్టీసీ కూర్మన్నపాలెం స్టీల్‌సిటీ డిపోలో ఎన్ఎంయు ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. డిపో ఆవరణలోని యూనియన్ కార్యాలయంలో డివిజనల్ అధ్యక్షుడు వి.ఎస్.ఆర్. మూర్తి ఆదివారం 10వ రోజు దీక్షలను ప్రారంభించారు. బస్సులకు స్పేరు పార్టులు ఇప్పించాలని, అన్యాయంగా జీతం కోత విధించిన వారికి జీతాలు ఇవ్వాలని, సిక్ అయిన సందర్భంలో రోజుల తరబడి విధులకు తీసుకోకుండా వేధించే విధానం విడనాడాలని, ఓటీ, నైట్ షిఫ్ట్ అలవెన్స్‌లు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. దీక్షల్లో జె.ఎల్. రావు, ఎ.వి. రమణ, డి. రాము, జె.ఎస్. రావు కూర్చున్నారు.

విద్యార్థులకు పెయింటింగ్, క్విజ్ పోటీలు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఆయిల్ అండ్ లూబ్రికేషన్ విభాగం ఆధ్వర్యంలో ఆదివారం విద్యార్థులకు పెయింటింగ్, క్విజ్ పోటీలు నిర్వహించారు. ఆయిల్ అండ్ కన్జర్వేషన్ పక్షోత్సవాల్లో భాగంగా ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ సహకారంతో ఉక్కు క్లబ్ ఎంపీ హాలులో నిర్వహించిన పెయింటింగ్ పోటీల్లో 300 మంది పాల్గొనగా, క్విజ్ పోటీల్లో 9 పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం జరిగిన బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమంలో విభాగాధిపతి ఎ. బెనర్జీ విజేతలకు బహుమతులు అందజేశారు.

సినీ పరిశ్రమకు కోవిడ్ కొత్త పాఠాలు



మాట్లాడుతున్న సినీ సంగీత దర్శకుడు ఆర్.పి.పట్నాయక్

సీతంపేట(విశాఖ ఉత్తర): కోవిడ్ మహమ్మారి సినీ పరిశ్రమతో పాటు ప్రేక్షకులకు కొత్త పాఠాలు నేర్పిందని ప్రముఖ సినీ సంగీత దర్శకుడు ఆర్.పి.పట్నాయక్ అన్నారు. వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో స్థానిక పౌర గ్రంథాలయంలో 'కోవిడ్ తర్వాత ప్రపంచ సినిమా పరిస్థితి' అంశంపై ఆదివారం జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం ఇళ్లల్లో కూర్చొని తమకు నచ్చిన సినిమా వీక్షించే అవకాశం కలిగిందన్నారు. ప్రేక్షకులు సినిమాలు చూసే విధానం కూడా మారిందన్నారు. ముఖ్యంగా సినిమా హాళ్లకు వెళ్లే ప్రేక్షకుల సంఖ్య బాగా తగ్గిందని అభిప్రాయపడ్డారు. మన సినిమాలు ఇతర భాషా చిత్రాలతో పోల్చుకునే అవకాశం కలిగిందన్నారు. ఈ సందర్భంగా పలువురు అడిగిన ప్రశ్నలకు ఆర్పీ జవాబులిచ్చారు. ఫిల్మ్ సొసైటీ సభ్యులు పి.ఎస్.మూర్తి పెన్సిల్‌తో గీసిన స్కెచ్‌ను ఆయనకు బహూకరించారు. నరవ ప్రకాశరావు మాట్లాడుతూ పట్నాయక్ సంగీత దర్శకత్వం వహించిన పలు చిత్రాలతో త్వరలో ఫిల్మ్ ఫెస్టివల్ నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆచార్య ఎస్.ఎ.డి.పాల్, కాశీ విశ్వేశ్వరరావు, బి.చిన్నారావు, బాబ్జి, కుమారి, అనురాధ, శివన్నారాయణ, చంద్రశేఖర్, రాజీవ్ పాల్గొన్నారు.

ముగిసిన గరికిపాటి ప్రవచనాలు

సీతమ్మధార: మహా సహస్రావధాని, పద్మశ్రీ పురస్కార గ్రహీత గరికిపాటి నరసింహారావు ఆధ్యాత్మిక ప్రవచనాల కార్యక్రమం ఆదివారంతో ముగిసింది. అల్లూరి సీతారామరాజు సమితి ఆధ్వర్యంలో సీతమ్మధార క్షత్రియ కల్యాణ మండపంలో మూడు రోజుల పాటు నిర్వహించారు. పలు ఆధ్యాత్మిక అంశాలపై ఆయన ప్రవచించారు. అనంతరం గరికిపాటి నరసింహారావు దంపతులకు సమితి అధ్యక్షుడు డి.తిరుపతిరాజు, కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. చైర్మన్ ఎం.ఎస్.ఎన్.రాజు, సెక్రటరీ డి.ఎస్.పి.వర్మ పాల్గొన్నారు.

షిర్డీసాయిని దర్శించుకున్న గరికిపాటి

సీతమ్మధార: మహా సహస్రావధాని, పద్మశ్రీ పురస్కార గ్రహీత గరికిపాటి నరసింహారావు దంపతులు ఆదివారం సాయంత్రం సీతమ్మధార నార్త్ ఎక్స్‌టెన్షన్‌లోని శ్రీమహాగణపతి, ప్రసన్న వేంకటేశ్వర స్వామి, అయ్యప్ప, షిర్డీసాయిబాబా దేవాలయాన్ని సందర్శించారు. వారికి ఆలయ అర్చకులు, ధర్మకర్తలు పూర్ణకుంభం, మేళతాళాలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం షిర్డీసాయిబాబాను వారు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

చలసాని ఆశయాలు కొనసాగిద్దాం

సీతంపేట: మార్క్సిజాన్ని సమాజానికి అన్వయించి.. పరిశీలించే దృష్టితో చూసినప్పుడే వాస్తవ పరిస్థితులు అర్థం అవుతాయని నమ్మే వ్యక్తి చలసాని ప్రసాద్ అని విప్లవ రచయిత సంఘం రాష్ట్ర నేత సి.ఎస్.ఆర్ ప్రసాద్ అన్నారు. మార్క్సిస్టు మేధావి, విప్లవ రచయిత చలసాని ప్రసాద్ 8వ వర్ధంతి సందర్భంగా 'నేటి రాజకీయాలు సాహిత్యం' అనే అంశంపై శనివారం పౌరగ్రంథాలయంలో సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్క్సిజాన్ని చలసాని ప్రసాద్ ముందుగా జీవితానికి అన్వయించుకుని, ఆ దిశగా కుటుంబ సభ్యులను భాగస్వామ్యం చేశారన్నారు. స్టాలిన్ హింసాకాండపై అనేక మంది విమర్శించినప్పటికీ.. చలసాని మాత్రం స్టాలిన్ చేసిందే సరైందని అన్నారని తెలిపారు. ఆ రోజుల్లో స్టాలిన్ ఆ విధంగా వ్యవహరించకపోతే అమెరికా, జర్మనీ కలిసి సోషలిజాన్ని కూల్చివేసేవారని చలసాని చెప్పేవారన్నారు. బీజేపీ అమలు చేస్తున్న మతతత్వ ఫాసిజాన్ని ఆయన తీవ్రంగా వ్యతిరేకించేవారని గుర్తు చేశారు. ఉత్తరాంధ్రలో ప్రజా ఉద్యమాలకు తలలో నాలుకగా వ్యవహరించిన కలం యోధుడు చలసాని ఆశయాలను కొనసాగించాలన్నారు. వీక్షణం సంపాదకుడు ఎన్.వేణుగోపాల్ మాట్లాడుతూ బీజేపీ పాలకులు హిట్లర్‌ను ఆదర్శంగా తీసుకుని హిందూమతం పేరుతో కలహాలు సృష్టిస్తున్నారని చలసాని చెప్పేవారన్నారు. ప్రముఖ రచయిత్రి మల్లీశ్వరి 'వర్తమానం చలసాని ప్రాసంగికత' అనే అంశంపై, ప్రముఖ రచయిత ఆచార్య చందు సుబ్బారావు 'చలసాని వ్యక్తిత్వం నిబద్ధత' అనే అంశంపై, మార్క్సిస్టు అధ్యయన కేంద్రం అధ్యక్షుడు జె.వి.సత్యనారాయణమూర్తి 'భారతదేశంలో ప్రజాస్వామ్యం, భవిష్యత్' అనే అంశంపై ప్రసంగించారు. ముందుగా చలసాని చిత్రపటానికి నివాళులు అర్పించారు. మాజీ ఎమ్మెల్యే మానం ఆంజనేయులు, ఇఫ్టూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.వెంకటేశ్వర్లు, జర్నలిస్టు సి.ఎస్.క్షేత్రపాల్ రెడ్డి, చైతన్య మహిళా సంఘం ప్రతినిధి కె.లలిత, పౌరసంఘాల సమన్వయకర్త పి.చంద్రశేఖర్, న్యాయవాది పద్మ పాల్గొన్నారు.

11 నుంచి అష్టలక్ష్మీ మహాయాగం

సీతంపేట: అధిక శ్రావణ మాసం సందర్భంగా అక్కయ్యపాలెం లలితానగర్‌లోని లలితా పీఠంలో వచ్చే నెల 11 నుంచి 16 వరకు అష్టపద్మ కుండాత్మక అష్టలక్ష్మీ మహాయాగం నిర్వహించనున్నట్లు కుర్తాళ పీఠం ఆస్థాన పండితుడు మాచవోలు రమేష్ శర్మ తెలిపారు. లలితా పీఠంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో యాగానికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధిక మాసం విష్ణువు, లక్ష్మీదేవికి అత్యంత ప్రీతిపాత్రమని, అటువంటి మాసంలో జరిగే అష్టలక్ష్మీ యాగంలో పాల్గొన్న వారికి సిరిసంపదలు, అధికార, ధనప్రాప్తి కలుగుతాయన్నారు. భక్తులందరూ ఈ సత్ఫలితాలు పొందేలా లలితా పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి ఆశీస్సులతో వచ్చే నెల 11వ తేదీ సాయంత్రం 5.30 గంటలకు మహా సంకల్పంతో యాగం ప్రారంభమవుతుందని చెప్పారు. 12 నుంచి 15వ తేదీ వరకు ప్రతి రోజూ అష్టలక్ష్మీ యాగం, స్వర్ణ పుష్పార్చన, 16వ తేదీ ఉదయం పూర్ణాహుతి, సాయంత్రం 6 గంటలకు అష్టలక్ష్మీ సమేత నారాయణ కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించనున్నామన్నారు. లలితా పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ మాట్లాడుతూ జగద్గురువు, కుర్తాళం శంకరాచార్య సన్నిధిలో మొట్టమొదటిసారిగా పంచాహ్నిక అష్టలక్ష్మీ మహాయాగం నిర్వహిస్తామని వెల్లడించారు. యాగంలో పాల్గొన దలచిన భక్తులు 98492 86779, 89777 88055 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

జాగ్రత్తగా ఓటర్ల జాబితాల పరిశీలన



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి

పెదగంట్యాడ: ఓటర్ల వివరాలను జాగ్రత్తగా పరిశీలించాలని గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి సూచించారు. నడుపూరులోని ఆర్యవైశ్య సంఘం జ్ఞాన మందిరంలో వైఎస్సార్ సీపీ 76వ వార్డు అధ్యక్షుడు దొడ్డి రమణ ఆధ్వర్యంలో బీఎల్‌వోలు, సచివాలయ గృహ సారథులతో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు నమోదు చేయాలన్నారు. అలాగే ప్రతి ఓటరు వివరాలు నిశితంగా పరిశీలించాలన్నారు. మార్పులు, చేర్పులు ఉంటే చేయాలన్నారు. ఓటరు ఎవరైనా మృతి చెంది ఉంటే జాబితా నుంచి వారి పేర్లు తొలగించాలన్నారు. ఓటర్ల పరిశీలన విషయంలో అవకతవకలకు పాల్పడితే సహించేది లేదన్నారు. కార్యక్రమంలో మండల క్లస్టర్ ఇన్‌చార్జి కులుకూరి మంగరాజు, పరాంకుశం ప్రమీల, నరసింహమూర్తి, మురళి, శరత్‌కుమార్, సత్యప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

29న ప్రైవేటు ఉపాధ్యాయులకు శిక్షణ



సమావేశంలో ప్రసంగిస్తున్న భాస్కరరావు

గాజువాక: మారిన పాఠ్యాంశాలపై ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులకు ఈ నెల 29న నిర్వహించనున్న ప్రత్యేక శిక్షణను పాఠశాలల యాజమాన్యాలు జయప్రదం చేయాలని గాజువాక పారిశ్రామిక ప్రాంత ప్రైవేటు పాఠశాలల సంక్షేమ సంఘం (జిప్సా) అధ్యక్షుడు పాలవలస భాస్కరరావు కోరారు. గాజువాకలో ఆదివారం నిర్వహించిన జిప్సా సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. నిష్ణాతులతో శిక్షణను నిర్వహిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ప్రైవేటు పాఠశాలల సమస్యలపై చర్చించారు. జిప్సాకు వీలైనంత త్వరగా స్థలం కేటాయించడం కోసం ఎమ్మెల్యే నాగిరెడ్డితో చర్చిస్తున్నామని తెలిపారు. సమావేశంలో జిప్సా ప్రతినిధులు బి.శ్రీనివాసరావు, డి.శ్రీనివాస్, ఆర్.శోభన్‌బాబు, జగ్గారావు, జి.జగన్, ఎ.రాము, ఎం.సత్యనారాయణ, బాబూరావు, రమేష్‌నాయుడు, కుమార్ పాల్గొన్నారు.

సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో రక్తదానం



శిబిరంలో రక్తదానం చేస్తున్న ఉద్యోగులు

ఉక్కునగరం: స్థానిక సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. జేసీఐ స్టీల్‌సిటీ చాప్టర్, లైఫ్ షేర్ బ్లడ్ బ్యాంక్ సహకారంతో సమితి ఆధ్వర్యంలో 34వ సారి రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. స్టీల్‌ప్లాంట్ విశ్రాంత జీఎం కె.వి.ఎస్. జోగారావు, సత్యసాయి జిల్లా సర్వీస్ కోఆర్డినేటర్లు ఆర్.ఎ. నాయుడు శిబిరాన్ని ప్రారంభించారు. 90 మంది ఉక్కు ఉద్యోగులు రక్తదానం చేశారు. బ్లాస్ట్‌ఫర్నేస్ విభాగానికి చెందిన ఎల్.వి. రామన్ 61వ సారి, ఆర్ఎంహెచ్‌పీ విభాగానికి చెందిన కె.వి.ఎల్.ఎన్. రెడ్డి 59వ సారి, ఈఎస్ఎండీ విభాగానికి చెందిన ఆర్.ఎ. నాయుడు 27వ సారి రక్తదానం చేయడం విశేషం. మహిళా సేవాదళ్ సభ్యులు పద్మా రాజశేఖర్, విష్ణుదేవి, పూర్ణిమ రక్తదానం చేశారు. సత్యసాయి సేవా సంస్థల జిల్లా వైద్య సేవా విభాగం కోఆర్డినేటర్ సాయికుమార్ దాతలను అభినందించారు. కార్యక్రమంలో సమితి కన్వీనర్ జి. రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బీఎంఎస్ ఆవిర్భావ దినోత్సవం



ఉక్కు టీటీఐ కూడలి వద్ద జెండా ఎగురవేస్తున్న బీఎంఎస్ నాయకులు

ఉక్కునగరం: భారతీయ మజ్దూర్ సంఘ్ (బీఎంఎస్) ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఆదివారం స్టీల్‌ప్లాంట్‌లో నిర్వహించారు. స్టీల్ బీఎంఎస్ ఆధ్వర్యంలో ఉక్కు టీటీఐ కూడలి, యూనియన్ కార్యాలయాల వద్ద జరిగిన కార్యక్రమంలో యూనియన్ నాయకులు పార్టీ పతాకాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ జాతీయ కార్మిక సంఘంగా కార్మికుల సమస్యల పరిష్కారానికి ఎనలేని కృషి చేసిందన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ జరగకుండా కృషి చేస్తున్నామన్నారు. ఉద్యోగులకు జరగాల్సిన వేతన ఒప్పందం వెంటనే జరిగేలా అందరి సహకారంతో ముందుకు వెళ్తామన్నారు. ఉద్యమాల్లో యువ కార్మికులు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.వి.ఎస్. నాయుడు, జిల్లా కార్యదర్శి రాందాసు నరేంద్ర, నాయకులు కొమ్మినేని శ్రీనివాసరావుతో పాటు కార్యవర్గ సభ్యులు, కార్మికులు పాల్గొన్నారు.

కేంద్రానికి కనువిప్పు కలిగే వరకు ఉక్కు ఉద్యమం



892వ రోజు దీక్షలో మాట్లాడుతున్న మంత్రి రాజశేఖర్

కూర్మన్నపాలెం: కేంద్ర ప్రభుత్వానికి కనువిప్పు కలిగే వరకు ఉక్కు ఉద్యమం ఆగదని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు పేర్కొన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలి వద్ద కొనసాగుతున్న రిలే దీక్షలు ఆదివారం నాటికి 892వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షా శిబిరంలో ఇంటక్ ప్రతినిధులు, కార్మికులు కూర్చున్నారు. ప్రభుత్వ రంగ పరిశ్రమల వల్లనే దేశంలో ఆర్థికాభివృద్ధి జరిగిందని, దీనిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వ రంగ సంస్థల పట్ల కేంద్రం పునరాలోచించుకోవాలన్నారు. కార్మిక హక్కులు అమలు కావాలన్నా, నిర్వాసితులకు న్యాయం జరగాలన్నా విశాఖ ఉక్కును ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమను రక్షించుకోవడం కోసం కార్మిక వర్గం ఎలాంటి త్యాగాలకైనా సిద్ధంగా ఉందన్నారు. ఈ కార్యకమంలో పోరాట కమిటీ నాయకుల, కార్మికులు పాల్గొన్నారు.

అప్పన్నకు వైభవంగా ఆర్జిత సేవలు

- ఘనంగా స్వర్ణపుష్పార్చన
- విశేషంగా నిత్యకల్యాణం



తలంబ్రాలు ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: సింహగిరికి ఆదివారం భక్తులు పోటెత్తారు. దీంతో క్యూ లైన్లు రద్దీగా కనిపించాయి. ఆధ్యాతికత ఉట్టిపడింది. వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు స్వర్ణపుష్పార్చన ఘనంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అలంకరించి కల్యాణ మండపంలోని వేదికపై అధిష్ఠంపజేశారు. 108 స్వర్ణసంపెంగ పుష్పాలతో స్వామికి అష్టోత్తరశతనామావళి నిర్వహించారు. విశేషంగా హారతులు ఇచ్చారు. పూజలో పాల్గొన్న ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. ఆలయ ప్రధానార్చకుడు ఇరగవరపు రమణాచార్యులు ఆధ్వర్యంలో అర్చకులు పూజలు నిర్వహించారు. ఆలయ సూపరింటిండెంట్ సునీల్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

వైభవంగా నిత్యకల్యాణం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.